www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 అక్టోబర్ 2025

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

'చక్రాలమడుగు'పై కబ్జా గొడుగు!

- అడ్డదిడ్డంగా అక్రమ కట్టడాలు
- అక్రమార్కులకు అధికార పార్టీ అండదండలు
- పట్టని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- రాజంపేటకు ముంపు భయం

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట మండలంలో రోజురోజుకు దురాక్రమణలు హెచ్చు మీరుతున్నాయి. చెరువులు, కొండలు, గుట్టలు, వాగులు, వంకలు అన్న తేడా లేకుండా ఖాళీ జాగా కనిపిస్తే ఆక్రమణదారులు పాగా వేస్తున్నారు. ఎంతో ప్రాశస్త్యం, చరిత్ర కలిగిన చక్రాలుమడుగు సైతం దురాక్రమణకు గురవుతూ రోజు రోజుకూ కుచించుకుపోతోంది. శేషాచలం అడవుల నుంచి పుల్లంగేరు మీదుగా ప్రవహిస్తూ పవిత్ర పుణ్యక్షేత్రమైన హత్యరాలలోని బాహుద నదిలో కలిసే చక్రాలమడుగు పూర్వం రాజంపేట వాసులకు మంచినీటి వనరుగా కూడా వినియోగంలో ఉండేది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన చక్రాలమడుగును ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతల అండదండలతో చోటా నాయకులు కబ్జాలకు పాల్పడుతుండడంతో నేడు మడుగు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కడప-చెన్నై జాతీయ రహదారికి ఆనుకుని ఉండడం వలన మార్కెట్ ధర ఎక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరి చూపు మడుగుపై పడి దురాక్రమణకు పాల్పడుతున్నారు. ఆక్రమణల కారణంగా మడుగు కుచించుకుపోవడంతో వరద నీరు వెళ్లే మార్గం లేక

కుచించుకుపోయిన చక్రాలమడుగు

వరదలు సంభవించినప్పుడు నీరు జనావాసాలలోటు ప్రవహించి జనజీవనాన్ని స్తంభింపజేస్తోంది. ఒకప్పుడు జవాద్ తుపాన్ సమయంలోనూ చక్రాలమడుగులోని వరద నీరు పట్టణంలోకి ప్రవహించి రాజంపేట పట్టణాన్ని అతలాకుతలం చేసింది. నాటి నుండి దురాక్రమణలు మరింత ఎక్కువ అవ్వడంతో భవిష్యత్తులో రాజంపేట పట్టణానికి ఎలాంటి ముప్పు వాటిల్లుతుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం

ప్రభుత్వాలు మారేకొద్ది అధికారంలో ఉన్న పార్టీ అండదండలతో చోటా నాయకులు తమ వ్యాపారాల విస్తరణ కోసం మడుగును ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి. చక్రాలమడుగు దురాక్రమణపై పత్రికలలో ఎన్నిసార్లు కథనాలు వెలువడినప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులలో ఏమాత్రం స్పందన లేదదు. అధికారులు ముడుపుల మాయలో పడ్డారో.. లేదా నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గారోనని రాజంపేట ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

చక్రాలమడుగు వద్ద లేఅవుట్లు వేసేందుకు చదును చేసిన భూమి

ఆక్రమణలు అడ్డుకోలేని అధికారులు

గతంలో అధికారంలో ఉన్న పార్టీలు, ఆ పార్టీలకు చెందిన చోటా నాయకులు ఆక్రమణలకు పాల్పడితే నాటి అధికారులు పట్టించుకోకపోవడం ఒక ఎత్తైతే.. ప్రస్తుతం కళ్ళముందే బహిరంగంగానే ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడుతుంటే చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కడప-చెన్నై జాతీయ రహదారిలోని భువనగిరిపల్లె ఆర్చికి సమీపంలోని నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను ఆనుకుని కొందరు కబ్జా రాయుల్లు మడుగును ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టేందుకు చదును చేసి నిర్మాణ సామగ్రి తోలుకొని సిద్ధంగా ఉంచారు. నిత్యం నాయకులు, అధికారులు, ప్రజలు సంచరించే ప్రధాన జాతీయ రహదారిలో నిర్మాణాలు చేపడుతుంటే అధికారులకు కళ్ళు మూసుకుపోయాయా అని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. చక్రాలమడుగు ఆక్రమణ విషయంలో జరిగిన నష్టం ఇక చాలని, ఇకమీదటైనా ఆక్రమణలు అడ్డుకోకపోతే మడుగు కనుమరుగవడం ఖాయమని, ఇప్పటికైనా రెవెన్యూ మరియు ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కులాయి బావిగా పిలుచుకునే వాళ్ళం..

మా చిన్నతనంలో చక్రాలమడుగు ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా ఉండేది. మడుగులో బావి నిర్మించి కుళాయిల ద్వారా రాజంపేట పట్టణానికి మంచినీరు అందిస్తూ వచ్చేవారు. దానివలన అప్పట్లో చక్రాలమడుగును కులాయి బావిగా పిలుచుకునే వాళ్ళం. ఇప్పుడు ఆ బావి ఏమైందో తెలియని పరిస్థితి. మడుగుకు వెళ్లే దారి కూడా కనుమరుగైపోయింది. ఎంతో ఆహ్లాదంగా ఉండే మడుగు నేడు చెత్తాచెదారం, మురుగునీటితో కంపు కొడుతోంది. పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వీడి ఇప్పటికైనా మడుగు రక్షణకు చర్యలు చేపట్టాలి. లేదంటే వరదల కారణంగా భవిష్యత్తులో రాజంపేట పట్టణం పెను ఉపద్రవం ఎదుర్కోక తప్పదు.

- నాయిని గిరిధర్, చిత్రకారుడు, బోయపాలెం.

దురాక్రమణలు ఉపేక్షించేది లేదు

చక్రాలుమడుగు దురాక్రమణాలకు సంబంధించి లోతుగా అధ్యయనం చేస్తున్నాం. రెవెన్యూ వారి సహకారంతో ఇటీవల మండల సర్వేయర్ మడుగు మొత్తాన్ని సర్వే చేపట్టారు. రెవెన్యూ శాఖ నుంచి నివేదిక రాగానే మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదికను కలెక్టర్‌కు పంపుతాం. బఫర్ జోన్ కింద వంకకు రెండు నుంచి ఐదు మీటర్ల వరకు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వద్దని ఇరిగేషన్ ఇఇ మునిసిపల్ కమిషనర్‌కు నివేదించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చక్రాలమడుగు దురాక్రమణలను ఉపేక్షించబోం.

- మధు, ఎఇ, ఇరిగేషన్, రాజంపేట.

విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు సిద్ధంకండి

- స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు, ఉద్యోగులు సమ్మెకు సిద్ధం కావాలని స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయం ఎదుట స్ట్రగుల్ కమిటీ సభ్యులు సమ్మెకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తరహాలో విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే క్రమబద్ధీ కరించాలన్నారు. వన్ ఇండస్ట్రీ, వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ ఇంప్లిమెంట్ చేసి కార్మికులకు న్యాయం చేసే వరకు, పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కారుణ్య నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని, నగదు రహిత అపరిమిత మెడికల్ పాలసీని వర్తింపజేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల పేర్ల మీద రూ.కోటి ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. దళారి వ్యవస్థ లేకుండా వేతనాలు చెల్లించడం వల్ల విద్యుత్ సంస్థకు రూ.192 కోట్ల భారం తగ్గుతుందన్నారు. ఒకవైపు ధరలు పెరుగు తున్నప్పటికీ పెండింగ్ అరియర్స్ విడుదల చేయక పోవడం అన్యాయమని పేర్కొన్నారు. విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను శాంతియుత వాతావరణంలో పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో తాము సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందుకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు. కార్మిక వర్గ శ్రేయస్సు, సమస్యల పరిష్కారం అయ్యేవరకు తమ ఉద్యమాన్ని ఆపబోమంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు సుబ్రమణ్యం రాజు, ఎ.వి.రమణ, శ్రీనివాసన్‌రెడ్డి నగేష్ గౌడ్, రాయచోటి కమిటీ నేతలు గంగన్న రెడ్డప్ప, ఖాదర్‌బాషా, భూషణ, ముస్తాక్ అహ్మద్, రాంబాబు, జోష్ణ, అర్చన, రాధిక శాంతకు మారి సింధుజ, స్వాతి, భానుమతి పాల్గొన్నారు. **రాజంపేట** : ఈ నెల 15 నుంచి విద్యుత్ కార్మికులు మెరుపు సమ్మెకు సిద్ధం కావాలని రాజంపేట విద్యుత్ స్ట్రగుల్ కమిటీ పిలుపు నిచ్చారు. విద్యుత్ కార్యాలయం వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యుఇఇయు జిల్లా కార్యదర్శి ఇ.శ్రీహరి, యుఇసి.డబ్ల్యుయు డివిజన్ అధ్యక్షులు సుధాకర్, కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ తరహాలో విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజంపేట స్ట్రగుల్ కమిటీ నాయకులు హరిధర్ కుమార్, సుబ్రహ్మణ్యం, శివ, రమేష్, చంద్రమోహన్, నారాయణస్వామి, ఒ.వి.రమణ, గురునాథం, విశ్వనాథం, సందీప్, కార్తీక్ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు** : కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, సంస్థ పరిరక్షణకై కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారం అయ్యేవరకు మేము సైతం సమ్మెకు సిద్ధమని యుఇఇయు రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి కె.కిరణ్ అన్నారు. కరపత్రాలు ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని, నగదు రహిత అపరిమిత మెడికల్ పాలసీని వర్తింపజేయాలని, కాంట్రాక్టు కార్మికులకు కోటి రూపాయలు ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుఇఇయు రాష్ట్ర నాయకులు వి.సుబ్రమణ్యం, సి.నారాయణ, బాలకృష్ణ, రమేష్, సురేష్, శివ, బాషా, నాగరాజా ఆర్.ఈశ్వరరావు, ఎస్.సుధాకర్, జయకృష్ణ, అంకయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు : వైసిపి

రైల్వేకోడూరు : ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

కల్తీ మద్యం తయారీ, విక్రయాల ద్వారా పేదల ప్రాణాలతో చలగాటమాడొద్దని, ఆడ బిడ్డల తాళిబొట్లు తెంచవద్దు అంటూ మహిళలు రాయచోటిలో నిరసన వ్యక్తం చేశారు. వైసిపి పిలుపు మేరకు మహిళలు కల్తీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం పట్టణంలో శాంతియుతంగా నిరసన చేపట్టారు. వైసిపి కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ పోలీసులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ పర్వీన్, పట్టణ అధ్యక్షులు నాజనీన్లు మాట్లాడుతూ టిడిపి నాయకులు కల్తీమద్యం తయారుచేసి నేరుగా హోటళ్లు డాబాలు, రోడ్డు పక్కన చిన్న చిన్న అంగళ్లల్లో సైతం అమ్మకాలు చేపడుతుండడం దారుణం అన్నారు. కూటమి నేతలు కల్తీమద్యం తయారీతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారంటూ వారు మండిపడ్డారు. ఎంతోమందిని మరణించేలా, అనారోగ్యం బారిన పడేలా చేసిన కల్తీమద్యం తయారీని పూర్తి స్థాయిలో నిర్మూలించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజు రహిమాన్, నేతలు ఆరీఫుల్లాఖాన్, హబీబుల్లాఖన్, జిల్లా మహిళా కార్యదర్శి సరియా, మహిళా సభ్యులు మదర్ బి, ఆరిఫా రజియా సుల్తానాతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** నకిలీ మద్యం మాఫియాను కూటమి ప్రభుత్వం పెంచి పోషిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆరోపించారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టి స్థానిక ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మనూజా కిరణ్ రెడ్డి, అబ్జర్వర్ అనూషరెడ్డి, ఎస్ఇసి సభ్యులు షమీమ్ అస్లాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట** : ములకలచెరువు కల్తీ మద్యం ఘటనపై వైసిపి మహిళా నాయకులు, కార్యకర్తలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి శ్రీవాణి, మాజీ డిసిఎంఎస్ చైర్పర్సన్ దండు చంద్రలీల, నందలూరు మండల వైసిపి అధ్యక్షులు పల్లె మాధవి, మండల అధ్యక్షులు రమణమ్మ, రెడ్డిమాసి రమేష్ నాయుడు, జడ్‌పిటిసి దాసరి పెంచలయ్య, దండు గోపి, వడ్డే రమణ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు** : నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలంటూ వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు వై.శివారెడ్డి, పుల్లంపేట ఎంపిపి ముద్దాబాబుల్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, భరతకుమార్ రెడ్డి, నందా బాల, మాజీ ఎంపిటిసి బి.ఆనంద్, సర్పంచ్‌లు శివయ్య, చెంగల్ రెడ్డి, హరికృష్ణరెడ్డి, ఆర్.వి.రమణ, ప్రతాప్ రెడ్డి, రఫీ, రామకృష్ణ, రాజేశ్వరమ్మ, ఎంపిటిసి పుష్పలత, బండారు మల్లికార్జున, రౌఫ్, అరుణమ్మ, కరీముల్లా, శంకరయ్య పాల్గొన్నారు.

చిత్తూరు జడ్‌పి సిఇఒకు రాజీనామా పత్రాన్ని ఇస్తున్న ఎంపిపి

తంబళ్లపల్లి ఎంపిపి అనసూయ రాజీనామా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె ఎంపిపి అనసూయ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. వైసిపి నాయకులతో కలసి చిత్తూరులోని జిల్లా పరిషత్ సిఇఒను కలసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న తమ పిల్లలను చూసేందుకు భర్త నారాయణరెడ్డితో కలిసి వెళ్తున్నామని ఏడు నెలల పాటు అక్కడే ఉంటామన్నారు. ఈ సమయంలో మండల అభివృద్ధికి ఆటంకం కలుగకుండా వేరొకరిని నియమించాలని కోరుతూ తన పదవికి రాజీనామా చేశానని పేర్కొన్నారు.

మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలి

- అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

మినీ అంగన్వాడీ కేంద్రాలను ఎటువంటి షరతులు లేకుండా మెయిన్ కేంద్రాలుగా మార్చాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, కోశాధికారి హరిశర్మ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీలక్ష్మీ అధ్యక్షతన జిల్లా స్థాయి మినీ అంగన్వాడీల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చడంతో మినీ అంగన్వాడీల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల నిరంతనం పోరాటం వల్ల ప్రభుత్వం మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చడం అభినందనీయమన్నారు వెంటనే జీవో అమలు చేసి హెల్పర్ల నియామకం చేపట్టాలన్నారు. 2023లో చేపట్టిన 42 రోజుల చారిత్రాత్మక సమ్మె కాలపు హామీలు వెంటనే చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో అంగన్వాడీలకు రెండు నెలల జీతం, నాలుగు నెలల సెంటర్ల అద్దె, ఐదు నెలల కూరగాయల బిల్లులు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐసిడిఎస్ ఉన్నతికి, అంగన్వాడీల సంక్షేమం కోసం రాజులేని పోరా టాలు చేస్తామన్నారు. మినీ వర్కర్లు మాట్లాడుతూ సిఐటియు మద్దతుతో ప్రభుత్వం మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చడం సంతోష దాయకమని రూ.4500 వేతనం పెరగడం, హెల్పర్లను కేటాయించడం, బదిలీలు ప్రమోషన్లలో భాగస్వామ్యులను చేయడంలో యూనియన్ కృషిని కొనియాడారు. అనంతరం మినీ వర్కర్ల పోరాట విజయోత్సవంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

బడ్జెట్ విడుదలతో మహాధర్నా విరమణ

రాయచోటి ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలకు కూరగాయలు, అద్దె, రెండు నెలల వేతనాలు, 14 మందికి పెండింగ్ జీతాలకు సంబంధించిన ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయడంతో ఈ నెల 13న నిర్వహింప తలపెట్టిన మహాధర్నాను విరమించినట్లు అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, రాయచోట ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షులు సిద్ధమ్మ, అంగన్వాడీలు తెలిపారు.

అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా అమరేంద్ర

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అమరేంద్ర నాయక్

అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులుగా మదనపల్లె నక్కలదిన్నె తాండాకు చెందిన అమరేంద్ర నాయక్ ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆదివారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంజారాల ఆత్మీయ సదస్సులో ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా లాయర్ నగేష్ నాయక్, సెక్రెటరీగా వేణుగోపాల్‌నాయక్, జాయింట్ సెక్రెటరీగా మునుస్వామి, ట్రెజరర్‌గా ప్రభాకర్ నాయక్, వైస్ ట్రెజరర్‌గా శ్రీకాంత్ నాయక్, సలహాదారులుగా రామానాయక్, రెండో సలహాదారునిగా గ్యాంగే నాయక్, జిల్లా యువజన నాయకుడిగా రామ్మూర్తి నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం అమరేంద్రనాయక్ మాట్లాడుతూ బంజారాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. బంజారాలకు రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తామని స్పష్టం చేశారు. తనపై నమ్మకముంచి ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలి

- పిహెచ్‌సి వైద్యులకు సంఘీభావంగా నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యులు తమ డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న దీక్షకు మద్దతుగా సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. సోమవారం ఎంఎ హెచ్ఇఒ రామాంజులు ఆధ్వర్యంలో మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి వైద్య సిబ్బంది వైద్యుల సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలను ధరించి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సిల్లో పని చేస్తున్న వైద్యులు తొమ్మిది రోజులుగా దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇంక్రిమెంట్లు, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి అదనపు భత్యం, పదోన్నతులు, స్కేల్ వర్తింపు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్యుల సమస్యలు పరిష్కరించే వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు అవు తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ ఎంలు, సిహెచ్‌ఒలు, ఆశవర్కర్లు, పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

గురుకులం ప్రిన్సిపల్‌గా ఫకురున్నీసా

ప్రజాశక్తి -పీలేరు

ప్రిన్సిపల్ ఫకురున్నీసా

మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా షేక్ ఫకురున్నీసా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విద్యాశాఖ డిఎస్‌సి నిర్వహించి ఇటీవల చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో ఆమెను ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తు కోసం కృషి చేయడమే తన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తనకు సహాయ సహకారాలు అందించాలని ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తలిదండ్రులను కోరారు. ఆరేళ్లుగా తాను పిజిటి, జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహించానన్నారు. తాను ఎంఎస్‌సి మ్యాథ్స్, ఎంఎస్‌సిఐటితో పాటు ఎంటెక్ పూర్తి చేశానని, ఉద్యోగంలో చేరక ముందు ఐఐటి, జెఇఇ విద్యార్థులకు మ్యాథ్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చానని తెలిపారు.

16న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగమేళలో వివిధ కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈ ఉద్యోగ మెళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కింద తెలిప లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ https://naipunyam.ap.gov.in/user-registratio అమరిన్ని వివరాలకు 9550095775, 9052717078, 8897776368 నంబర్లను సంప్రదించగలరు.

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కార మార్గం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని, ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు వివిధ రకాల అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మంత్రిచే ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని 40వ జాతీయ రహదారిపై నీలకంఠరావుపేట ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలో అన్నయ్య ఏర్పాటు చేసిన అంబికా ఫ్యామిలీ రెస్టారెంట్ ను సోమవారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో జాతీయ రహదారికి పక్కన ఫ్యామిలీ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మంచి రుచికరమైన వంటలతో అందరి మన్ననలు పొంది దినదినాభివృద్ధి చెందాలని ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ కొండ భాస్కర్‌రెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్ సహదేవరెడ్డి ఆగ్రోవెంకట్రామిరెడ్డి, మండల టిడిపి నాయకులు రెస్టారెంట్ యజమాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో మరొకరు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

నకిలీ మద్యం కేసులో మరొకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 3న ములకలచెరువు సమీపంలోని ఓ గోడౌన్‌లో నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు సమాచారం ఉండడంతో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి కల్తీ మద్యంను సీజ్ చేసి పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పిటిఎం మండలం, చెంద్రాయునిపల్లి సమీపంలో ఉన్న ఆంధ్ర వైన్స్‌లో పనిచేస్తున్న చైతన్య బాబుని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. చైతన్య బాబు ఈ కేసులో ఎ22గా ఉన్నారు. అనంతరం ఎక్సైజ్ పోలీసులు చైతన్య బాబుని తంబాలపల్లి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం మదనపల్లి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

'మిట్స్'లో ట్యాబులూ యాప్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు ఆధునిక సాంకేతికతను వినియోగించి ట్యాబులూ (Tabuloo) అనే వినూత్న మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఈయాప్‌ను యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ ప్రారంభించారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు షేక్ ఇమ్రాన్ (సైబర్ సెక్యూరిటీ), జి.తనూజ్ (ఇసిఇ), ఎస్.చైతన్య (మెకానికల్), బి.నవీన్ కుమార్ (సిఎస్‌టి)తో పాటు మూడవ సంవత్సరం ఇసిఇ విద్యార్థులు పి.అహమ్మద్ ఆఫ్సహాన్, సయ్యద్ జునైద్ కలిసి ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. ట్యాబులూ వినియోగదారులు సమీపంలోని రెస్టారెంట్లను ఎంపిక చేసుకొని ముందుగానే టేబుల్ బుక్ చేసుకోవచ్చు. దీని ద్వారా సమయం ఆదా కావడంతో పాటు కస్టమర్ అనుభవం మరింత మెరుగవు తుందని విద్యార్థులు తెలిపారు. యాప్ అనేక ప్రముఖ రెస్టారెంట్లతో టైఅప్ చేసుకొని డిజిటల్ బుకింగ్ ప్లాట్‌ఫారమ్‌ను అందిస్తోంది. రెస్టారెంట్ యజ మానులు బుకింగ్‌లు, ఆర్డర్లు, కస్టమర్ ఫీడ్‌బ్యాక్‌ను సులభంగా నిర్వహిం చుకునే అవకాశం కలుగుతుంది. సురక్షిత చెల్లింపులు, యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్ వంటి ప్రత్యేకతలతో తబులో యాప్ వినియోగదారులకు కొత్త అనుభవాన్ని అందించనుంది. త్వరలోనే ఇది ఐఒఎస్ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు మార్గదర్శకత్వం వహించిన డాక్టర్ చొక్కనాథన్, డాక్టర్ రాజశేఖరన్, డాక్టర్ గంగాదేవి, డాక్టర్ జి.నాగశ్వేతా, పి.రిజ్వాన్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఇఇఇ కో-ఆర్డినేటర్ డాక్టర్ సి.కుమార్, డాక్టర్ పి.రామనాథన్, డాక్టర్ కె.దినేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-కలికిరి

సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపిడిఒ భానుమూర్తిరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ సమావేశ భవనంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపైన సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ భానుమూర్తి రావు, డిప్యూటీ ఎంపిడిఒ మహమ్మద్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామ పాలనలో ముఖ్యంగా ఎనిమిది అంశాలపైన అవగాహన కలిగి ఉండాలని, అందులో పేదరిక నిర్మూలన, ఆకలి లేని సమాజం, మంచి ఆరోగ్యం, క్షేమం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, పరిసరాలు పరిశుభ్రత నీరు పారిశుధ్యం, ప్రభావంతమైన, శుద్ధమైన శక్తి వనరులు, హుందాతనం కలిగిన పని శక్తి, ఆర్థిక అభివృద్ధి, పరిశ్రమల నవీకరణ వంటి వాటిపై అవగాహన కలిగించి 2030 నాటికి ప్రజల అందరికీ అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్లవోలు సెక్రెటరీ నవాజుల్లా, గుండ్లూరు సెక్రటరీ గోపి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

స్వచ్ఛంద సేవా సంస్థలు, సంఘాల ద్వారా దాతలు అందించే సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ జిల్లా అధికారులు ఎస్.కె. హుస్సేన్, మనోజ్ కుమార్ కోరారు. రోటరీ క్లబ్ సభ్యుడు రూపేష్ పుట్టినరోజు పురస్కరించుకొని మండలంలోని గొర్లముదివేడు ఎంపిపి పాశాలలో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు అందజేసే విద్యా సామగ్రినీ విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. పిల్లలు క్రమశిక్షణ ,పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. చదువుతో పాటు ఇతర ఇతర నైపుణ్యాలను అలవర్చుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ సూర్యప్రకాష్, దాత రూపేష్, సభ్యుడు జోషితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

జీవన ఎరువుల ప్రాముఖ్యతపై సోమవారం కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని మేడికుర్తి, పీలేరు మండలంలోని మిట్టపల్లి సోమశేఖర్‌బాబు, సేద్య విభాగం శాస్త్రవేత్త, జీవన ఎరువులైన రైజోబియం, అజోస్పైరిల్లమ్, అజటోబాక్టర్, భాస్వరం కరిగించే జీవన ఎరువు, పొటాష్ విడుదల చేసే జీవన ఎరువు మొదలగు వాటి గురించి వివరించారు. రైతులకు వాటిని ఏ పంటల్లో ఎంత మోతాదులో వాడే విధానాన్ని, వాటి ఉపయోగాలని తెలిపారు. జీవన ఎరువులు వాడడం ద్వారా రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి తక్కువ ఖర్చుతో మంచి పంట దిగుబడి సాధించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, డాక్టర్ కె.మాధురి, డాక్టర్ ఎ.శ్రీనివాసులు, డాక్టర్ వై.పీరుసాహెబ్, శరత్ కుమార్‌రెడ్డి, రైతులు, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి మేలు

ప్రజాశక్తి-నందలూరు

జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతుందని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఎంపిడిఒ సభా భవనంలో ఎంపిడిఒ రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి కనీసం రూ.ఆరు వేల నుంచి 15 వేల వరకు ఆదా కలుగుతుందని చెప్పారు. ప్రతి దుకాణం ఎదుట తగ్గించిన జిఎస్‌టి వివరాలు ప్రచురించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అమరేశ్వరి, ఇఒపిఆర్‌డి సునీల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు. **సుండుపల్లి:** తగ్గించిన జిఎస్‌టిపై సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిడిఒ మాట్లాడారు. ఆరోగ్య జీవిత బీమా, దుస్తులపైన, పాదరక్షలు, మందులు, వాహనాలపై ప్రభుత్వం జిఎస్‌టి రేటును తగ్గించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రజలు, రైతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

గాలివీడు : నూతన ఉపాధ్యాయులకు ఎస్ఆర్‌లను అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

2025 మెగా డిఎస్‌సిలో ఎంపికైన 23 మంది ఉపాధ్యాయులకు ఎంఇఒలు నాగరాజు, శ్రీనివాసులు నియామక సోమవారం పత్రాలు అందజేశారు. వారికి రాష్ట్రోపాధ్యాయ సంఘం సర్వీస్ రిజిస్టర్‌లను అందజేసింది. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకి ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు నిబద్ధతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యను అందిస్తే విద్యార్థులు ఆ ఉపాధ్యాయుడిని జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని అన్నారు. నూతన ఉపాధ్యాయులు సాంకేతికతను వినియోగించుకొని అత్యుత్తమ బోధనను అందించాలని చెప్పారు. మండల విద్యాధికారులు మాట్లాడుతూ ఎస్‌టియు ఎస్ఆర్‌లు అందజేయడం అభినందనీయం అని చెప్పారు. కార్యక్రమానికి ఎస్‌టియు సీనియర్ జిల్లా నాయకులు కె.రామకృష్ణారెడ్డి, నాయకులు వెంకటరమణారెడ్డి, జిల్లా మైనారిటీ కన్వీనర్ మున్వర్‌బాషా, జిల్లా కౌన్సిలర్ చంద్రశేఖర్, ఎస్‌టియు మండల అంధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, సహాధ్యక్షులు జిట్టా నాగరాజు, ప్రధాన కార్యదర్శి బివిఆర్.నాయక్,ఆర్థిక కార్యదర్శి కె.నాగేశ్వర్ ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** డిఎస్‌సిలో ఎంపికైన 27 మంది టీచర్లు మండలంలోని వివిధ పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టారు. ఎంఇఒ కార్యాలయం వద్ద ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయులు నూతన టీచర్లకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కేక్‌కట్ చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. **సుండుపల్లె:** మండలంలోని మడితాడు పంచాయతీలో ఉర్దూ ఉన్నత పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారని ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అభీదుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యను బోధిస్తారని, ఐదుగురు ఉపాధ్యాయులు ఉండడంతో పిల్లలకు కష్టంగా ఉందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ కొత్తగా ఉపాధ్యాయులను ఎంపిక చేసి పంపడం వల్ల విద్యార్థులకు సంపూర్ణంగా విద్య అందుతుందని చెప్పారు. విద్యార్థులకు చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బందులులేకుండా చూసుకుంటామని చెప్పారు. ఐదుగురు నూతన ఉపాధ్యాయుల్లో శివాజీనాయక్, మునవర్ రసుల్, ఎం.ఎం. బస్సుమ్‌ఖానం, ఇనాముల్లా ఉన్నారని పేర్కొన్నారు. **ములకలచెరువు:** కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సిలో మండలంలోని భత్తలాపురానికి చెందిన చంద్రమోహన్ సత్యవతి కుమార్తెలు జల్లా శ్రీలత, జల్లా హేమలతలు జిలా స్థాయిలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి మదనపల్లి మున్సిపాలిటీలోని హోప్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అక్కాచెల్లెళ్లను యుటిఎఫ్ నాయకులు హర్ష వ్యక్తం చేస్తూ అలాగే వారికి స్వీట్స్ పంపిణీ చేసి వారి ఆనందం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ నాయకులు ఎగవింటి సుధాకర్, బెల్లం సుధాకర్, జయరాం, భార్గవి, శోభారాణి వారిని అభినందించారు. తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు.మ

ములకలచెరువు : అక్కాచెల్లెల్లను అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సిజెఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి : ఎంఆర్‌పిఎస్

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి కోటా ధనియాల మాదిగ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్ పై దాడి చేసిన రాకేష్ కిషోర్‌పై సుమోటో కేసుగా నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కోట దానియల్ మాదిగ, ఎర్రవారి పల్లి రవీంద్ర మాదిగలు మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయి పై కోర్టు ఆవరణంలోనే ఒక లాయర్ రాకేష్ కిషోర్ తన బూటుతో ప్రత్యక్ష దాడికి యత్నించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఈ దాడి భారతీయులు, దళిత పీడిత వర్గాల మనోభావాలు దెబ్బ తినే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలగి చర్ల శివయ్య మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగళ్ల శ్రీనివాసులు, మదనపల్లి ఇన్‌ఛార్జి వాసు మాదిగ, సీనియర్ నాయకులు కొండప్ప సార్, పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ మాదిగ, కో-ఇన్‌ఛార్జి ముల్లంగి రెడ్డప్ప పాల్గొన్నారు.

జోనల్ మీట్‌కు 'సిల్వర్ బెల్స్' విద్యార్థులు

రైల్వేకోడూరు : జోనల్ మీట్‌కు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ కుమార్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల మీట్‌లో సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఎం.వి.కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల మీట్‌లో జోనల్ మీట్‌కు ఎంపికైన వారిలో బాలురు షాట్‌పుట్ అండర్-17లో ఎన్.చైతన్య మొదటి స్థానం సాధించారని, బాలికల షాట్‌పుట్ అండర్-17లో గౌనూతల హర్షిత మూడవ స్థానం, 200 మీటర్ రన్నింగ్ రేస్ అండర్-14లో డి.లేఖన మొదటి స్థానం, బాలికల 200 మీటర్ రన్నింగ్ రేస్ అండర్-17లో రుచిత్ర వేణి రెండవ స్థానం, 400 మీటర్స్ రన్నింగ్ రేస్ అండర్-17లో పి.చరిష్మా మూడో స్థానం, 100 మీటర్స్ రన్నింగ్ రేస్ అండర్-17లో పి.రుచిత వేణి మూడోస్థానం, 400 మీటర్స్ రన్నింగ్ రేస్ అండర్-14లో టి.లేఖన మూడవ స్థానం సాధించారని పేర్కొన్నారు. జోనల్ మీట్‌కు ఎన్నికైన సందర్భంగా విద్యార్థులను, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ శ్రీహరిని కరస్పాండెంట్ ఎం.వి.కుమార్ తోపాటు హెడ్ మిస్ట్రెస్ విజయలక్ష్మి, హెడ్మాస్టర్ రాహుల్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం బైపిసి విద్యార్థిని వై.సంధ్య ఎస్‌జిఎఫ్ అండర్-19 బాలికల వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. చిన్నమండెం ఎపి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా పోటీల్లో సంధ్య అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ నీలకంఠరావు పేర్కొన్నారు. సంధ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి ప్రత్యేకంగా అభినందించారు.

పుల్లంపేట : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సంధ్య

విద్యాప్రదాత డాక్టర్ సేతు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ : పట్టణంలో మూడు దశాబ్దాలుగా విద్యా ప్రదాతగా వెలుగొం దుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దిన కీర్తి కెరటం డాక్టర్ ఎన్ సేతు అని వక్తలు కితాబిచ్చారు. సోమవారం పట్టణంలోని స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆ సంస్థ అధినేత డాక్టర్ ఎన్ సేతు జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణంలోని రాజకీయ నాయకులు, ప్రముఖులు, విద్యా పండితులు, పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు కేక్ కట్ చేసి డాక్టర్ ఎన్ సేతుకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పసుపులేటి చలపతి మాట్లాడుతూ మదనపల్లెలో మూడు దశాబ్దాలుగా విద్యా సంస్థను నిర్వహిస్తూ ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించారన్నారు. విద్యాప్రదాతగా పేరొందిన డాక్టర్ ఎన్. సేతు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సేతుకు కేక్ తినిపిస్తున్న చలపతి

'ఆదిత్య'లో హెచ్‌ఎంజి టెక్నాలజీస్ ఇంటర్న్‌షిప్ ఎంపికలు

ప్రజాశక్తి-మదనపల్లె : మదనపల్లె సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థుల కోసం 'హెచ్‌ఎమ్‌జీ టెక్నాలజీస్' సంస్థ తరపున సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ వివిధ విభాగాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు నెలకు రూ.15,000 స్టయిఫండ్ అందజేస్తారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ టెక్నాలజీ రంగంలో నూతన పరిజ్ఞానం అలవరచుకుని కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సి. మనోజ్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

జాబ్‌కార్డులకు ఇకెవైసి పూర్తి చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఉపాధి హామీ చట్టం కార్మికుల జాబ్‌కార్డులకు ఇకెవైసి ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఎంపిడిఒ రమేష్ బాబు అన్నారు. సోమవారం డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలసి ఎపిఒ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు చెందిన జాబ్‌కార్డులకు వెంటనే ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. కార్మికులు సక్రమంగా పాల్గొనేలా, వారికి అందే ప్రయోజనాలలో అవకతవకలను అరికట్టడానికి ప్రభుత్వం ఇకెవైసి ప్రక్రియను చేపట్టాలని ఆదేశించిందన్నారు. ఇప్పటివరకు సుమారు 50 శాతం మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన జాబ్ కార్డులకు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పని దినాలను కార్మికులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు : పంచాయ తీరాజ్ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణలను స్వాగతిస్తూ ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, పంచాయతీ కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ కలసి పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూల సంస్కరణలను తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గాయత్రి, గౌతమి, రాజశేఖర్ నాయక్, చిరంజీవి, నాగరాజా, నాగభూషణం, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన డైరెక్టర్

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలను సర్వ శిక్ష అభియాన్ సిమాట్ డైరెక్టర్, ఎపిఆర్ఇఎస్ సెక్రటరీ మస్తానయ్య తనిఖీ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ గోవింద్ తెలిపారు. సోమవారం ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ మస్తానయ్య స్కూల్స్‌ను సందర్శించడంలో భాగంగా మోడల్ స్కూల్ కలకడలోని ఆదర్శ పాఠశాలను తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పిఎంశ్రీ స్కూల్లోలో ప్లేగ్రౌండ్స్ సందర్శించారు. మోడల్ స్కూల్‌లో గ్రీనరీ చాలా బాగుందని అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఒలు మునీంద్ర నాయక్ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా రైతును సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

మహిళా రైతుకు సన్మానం

ప్రజాశక్తి-రామాపురం

ప్రధాని నరేంద్ర మోడీకి ఆంధ్రప్రదేశ్ తరపున జ్ఞాపికను అందజేసిన ఆదర్శ మహిళా రైతు శ్రీదేవిని అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మార్కెట్ కమిటీ చైర్మన్ సన్మానించారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం మహిళా ఆదర్శ రైతు సూరం శ్రీదేవికి అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ తరపున మండల ఆదర్శ మహిళ రైతు శ్రీదేవి పాల్గొని ఆదర్శ రైతు చిహ్నంగా ఎద్దుల బండిని అందజేశారు. సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, జిల్లా అధ్యక్షులు వెంకట మోహన్ లకిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి నాగమణి, మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ ఆమెను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్రం తరపున మండలానికి చెందిన ఆదర్శ మహిళా రైతు జ్ఞాపికను అందజేయడం జిల్లాకు మండలానికి ఎంతో పేరు తెచ్చిపెట్టిందన్నారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ సదాశివరెడ్డి వెంకటరామిరెడ్డి సుధాకర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో పుణ్యక్షేత్రమై మల్లయ్య కొండకు సోమవారం భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఉదయమే స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. భక్తుల పేరిట పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మల్లయ్య కొండ మహాశివుని ఆలయానికి దిగువన వెలుగు మల్లమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు మల్లమ్మకు దాత సురేంద్రరెడ్డి, లక్ష్మీదేవి దంపతులు అమ్మవారికి పుష్పాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, సహస్రనామార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు.

ఎస్‌సి, ఎస్‌టి కాలనీలకు గౌరవప్రదమైన పేర్లు ఖరారు చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి, ఎస్‌టి కాలనీలకు గౌరవప్రదమైన పేర్లు ఖరారు చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బోధిషా వలి తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన పీలేరు తహశీల్దారు శివకుమార్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండల పరిధిలోని అనేక గ్రామాల్లోని ఎస్‌సి, ఎస్‌టి కాలనీలు ఇప్పటికీ 'హరిజనవాడ', 'గిరిజనవాడ' అనే పేర్లతో పిలువబడుతున్నాయని, ఈ పేర్లు ప్రస్తుతం సామాజికంగా అనుచితంగా భావించబడుతున్న కారణంగా కాలనీ నివాసితులు, స్థానిక ప్రజలు తమ నివాస ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రతి పంచాయతీలోనూ సమావేశాలు నిర్వహించి, ప్రజాభిప్రాయం మేరకు కొత్త పేర్లను ఆమోదించి, పాత పేర్ల స్థానంలో అధికారిక రికార్డులు, రెవెన్యూ పత్రాలు, సైన్ బోర్డులు మొదలైన వాటిలో కొత్త పేర్లను నమోదు చేతాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తద్వారా కాలనీలకు గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుందని, సామాజిక సమానత్వానికి ఇది ఒక సానుకూల అడుగుగా నిలుస్తుందన్నారు.

సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం మండలంలోని విఠలం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు, శ్వాస తీసుకోవడంలో కష్టమైనప్పుడు అత్యవసర ప్రథమ చికిత్స చేసే దానిని సిపిఆర్ అంటారని తెలిపారు. సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండడం వలన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో అవసరం అవుతుందని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ రెడ్డెమ్మ, ఎఎన్‌ఎం అరుణ, నాగరత్న, ఆశావర్కర్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మహమ్మద్ రఫీ

క్రైం కార్నర్

గల్లంతైన విద్యార్థి మృతి

- కన్నీరు మున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మదనపల్లె బసినికొండ హంద్రీ నీవా కాలువలో ఆదివారం ఈతకు వెళ్లి 10వ తరగతి విద్యార్థి సాయి కిరణ్(16)గల్లంతైన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం సాయికిరణ్ మృతదేహం లభించింది. రామారావు కాలనీకి చెందిన సురేష్, సరళ దంపతుల కుమారుడు సాయికిరణ్ బసినికొండ అభ్యుదయ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కూడా స్కూల్ యజమాన్యం స్పెషల్ క్లాసుల పేరుతో తరగతులు నిర్వహించడంతో పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పక్కనే ఉన్న హంద్రీనీవా కాలువకు ఈతకువెళ్లాడు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. రాత్రింబవళ్లు గాలింపు చేపట్టడంతో సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన సాయికిరణ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని అమ్మచెరువు మిట్టకు చెందిన పవన్‌కుమార్, పల్లవి దంపతుల కుమారుడు అజయ్‌దేవ్ (19) ఫ్లిప్ కార్ట్‌లో పనిచేస్తున్నాడు. రాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. అమ్మచెరువు మిట్ట సమీపంలో వాహనం అదుపు తప్పడంతో, బోల్తా పడి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.